

నల్లగొండలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## రేవంత్‌రెడ్డిపై

# భగ్గుమన్న మహిళాలోకం

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు
- మహిళలకు సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- పలుచోట్ల దిష్టిబొమ్మల దహనం.. అడ్డుకునేందుకు పోలీసుల అత్యుత్సాహం

సూర్యాపేట, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడాన్ని నిరసిస్తూ మహిళాలోకం భగ్గుమంది. బీఆర్ఎస్ పార్టీ ఆధర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు చేపట్టింది. మహిళ అని చూడకుండా సీఎం, డిప్యూటీ సీఎం ఇష్టారాజ్యంగా మా ట్లాడటంపై మహిళలు, బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఎక్కడికక్కడ రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. సీఎం డౌన్ డౌన్.. వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన అం టూ నినదించారు. పలుచోట్ల రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. కొన్నిచోట్ల అడ్డుకునేందుకు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం తెలిపారు. కోదాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అర్వపల్లి, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజకవర్గాలతోపాటు జిల్లాలోని పలు మండలాల్లో నిరసనలు కొనసాగాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్‌జీ కాలేజీ దగ్గరున్న తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యానర్‌తో నిరసన తెలిపాయి. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, రాష్ట్ర నాయకురాలు మాలె శరణ్యారెడ్డి, కరీంపాషా, దేప వెంకట్‌రెడ్డి, బోనగిరి దేవేందర్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మిర్యాలగూడలో మాజీ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ కార్యాలయం నుంచి ఊరేగింపుగా సాగర్‌రోడ్డు మీదకు తీసుకొచ్చి దహనం చేశారు. మంద బలంలో దురహంకారం ప్రదర్శిస్తున్న రేవంత్‌రెడ్డి మహిళాలోకానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. దేవరకొండలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట డిండి మాజీ ఎంపీపీ మాధవరం సునీత ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీగా వెళ్లి, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నకిరేకల్‌లో మాజీ జడ్పీటీసీ మాద ధనలక్ష్మి, రామన్నపేట మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి ఆధ్వర్యంలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేశారు. భువనగిరిలోని ప్రిన్స్ కార్నర్ వద్ద జరిగిన ఆందోళనలోనూ దిష్టిబొమ్మ దహనం చేయకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, గుండాలలోనూ తోపులాట జరిగింది. దిష్టిబొమ్మలను, నిరసన ఫ్లెక్సీలను కాల్చకుండా లాక్కొని వెళ్లారు. బీఆర్ఎస్ నేతలను ఈడ్చుకు పోయారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నేతలకు తోపులాటలు జరిగాయి. అయినప్పటికీ వెనక్కి తగ్గకుండా గులాబీ శ్రేణులు దిష్టిబొమ్మలను దహనం చేశాయి. యాదగిరిగుట్టలో బీఆర్ఎస్ నేత లు ఆందోళన చేపట్టారు. మహిళా లోకానికి సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. ఆలేరులో జరిగిన కార్యక్రమంలో మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, భువనగిరి పట్టణంలో కంచర్ల రామకృష్ణారెడ్డి నిరసనల్లో పాల్గొన్నారు.



సూర్యాపేటలో నిరసన తెలుపుతున్న మహిళలు, చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ



కోదాడలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## డీఈఈ సెట్ ధృవపత్రాల పరిశీలన ప్రారంభం



ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన విద్యార్థులు

రామగిరి, ఆగస్టు 1 : డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమో ఇన్ ప్రీ ఎడ్యుకేషన్ రెండేండ్ల కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన డీఈఈ సెట్–2024 ధృవపత్రాల పరిశీలన గురువారం నల్లగొండలోని డైట్‌లో ప్రారంభమైంది. తొలిరోజు 1 నుంచి 400 వరకు నంబర్ ఉన్న విద్యార్థులు హాజరై సర్టిఫికెట్స్ పరిశీలన చేసుకొని వెబ్ ఆప్షన్స్‌కు అర్హత పొందారు. డైట్ ప్రిన్సిపాల్ కె.నర్సింహ పరిశీలన చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. శుక్రవారం 401 నుంచి 800వరకు, శనివారం 801 నుంచి 1,253 వరకు నంబర్ ఉన్న విద్యార్థులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

# రుణమాఫీ సగం మందికే!

- నల్లగొండ జిల్లాలో 83 వేల నుంచి 43 వేల మందికి తగ్గిన రైతుల జాబితా
- వ్యవసాయ కార్యాలయాలకు ఫిర్యాదుల వెల్లువ
- ఏం చెప్పాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్న యంత్రాంగం



నల్లగొండ యూనియన్ బ్యాంకులో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న రైతులు

నల్లగొండ, ఆగస్టు 1 : అరకొర రైతు రుణమాఫీ అన్నదాతలను ఆగ్రహానికి గురిచేస్తున్నది. ప్రతి రైతుకు రూ.రెండు లక్షల రుణం మాఫీ చేస్తామని రేవంత్ ప్రభుత్వం ప్రకటించగా వాస్తవంగా అందుకు విరుద్ధంగా ఉన్నది. జూలై 30న రెండో విడుతగా రూ.1.50 లక్షలు రుణం మాఫీ చేస్తున్నట్లు చెప్పినా సగం మందికి మాఫీ కాలేదు. నల్లగొండ జిల్లా 83వేల మంది రైతులకు సంబంధించి రూ.1014.68 కోట్లు మాఫీ అవుతుందని అధికారులు చెప్పగా బుధవారం నాటికి 43వేల మంది రూ.503. 89 కోట్లు మాత్రమే జమయ్యాయి. దాంతో ఏఈఓల నుంచి డీఏఓ వరకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లాలో బుధవారం 2,450, గురువారం 3,500 దరఖాస్తులు వచ్చినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇక మొదటి విడుతలో రూ.481 కోట్లు రుణ మాఫీ కావాల్సి ఉండగా పలు కారణాలతో రూ.465 కోట్లే అయ్యాయి.

### పలు కారణాలతో మాఫీ కట్

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసే పలు నిబంధనలు పెట్టింది. తొలుతగా కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే మాఫీ కట్ చేయగా ఆ తర్వాత ఐటీ చెల్లించే వారికి, ఐటీ రిటర్న్స్ చేసే వారికి సున్నా పెట్టింది. మెజారిటీ రైతుల్లో రేషన్ కార్డు లేదనే కారణంతో పక్కకు పెడుతున్నదని వ్యవసాయ శాఖకు వచ్చే ఫిర్యాదుల బట్టి బయట పడుతున్నది. ఇక రైతులు రుణం తీసుకున్న బ్యాంకుల్లో ఒకే ఆధార్ కార్డు ఇద్దరు ముగ్గురు పేరుతో కాపీ చేసి కొట్టినా, వారు సరైన రికార్డులు పంపకపోయినా, వ్యవసాయ అదికారులు తప్పుడు నివేదిక ఇచ్చినా చివరికి రైతే నష్టపోవాల్సి వస్తున్నది. చాలా రైతు ఖాతాదారుల్లో మాత్రం నో రికార్డ్స్, నో రేషన్ కార్డు అనే కారణాలే ఉన్నట్లు తెలుస్తున్నది.

### రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసిండు



నేను లక్ష రూపాయాలు పంట రుణం తీసుకున్నా. 7 వేల రూపాయల వడ్డీ అయ్యింది. రెండో విడుతలో లక్షన్నర రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పగా నాకు మాత్రం మాఫీ కాలేదు. కారణమేంటని తెలుసుకుంటే రేషన్ కార్డులేని వాళ్లకు ఇవ్వట్లేదని అర్థమైంది. అలాంటప్పుడు అందరికీ రుణమాఫీ చేస్తున్నామని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పడం ఎందుకు.. రైతులను మోసం చేసేంది ఎందుకు? రైతులను మోసం చేసిన ఏ ప్రభుత్వం కూడా నిలబడదు.

–సుధాకర్‌రెడ్డి, రైతు, చిత్తలూరు గ్రామం, పెద్దవూర మండలం

### కొర్రీలు పెడుతున్నరు



రెండు లక్షల మాఫీ చేయమని ఎవరు చెప్పిండ్రు. ఎవరు ఇవ్వమన్నరు. చేస్తే అందరికీ చేయండి. రేషన్ కార్డు ప్రమాణికం పెట్టకండి. అందరికీ రుణమాఫీ ఇస్తామని చెప్పి ఇప్పుడు రేషన్ కార్డును బట్టి చేస్తున్నారు. ఇవ్వాల ఇన్ని కొర్రీలు పెడితే ఎలా. మాది ప్రజాపాలన అని చెప్పి రైతులను మభ్యపెట్టి మోసం చేయొద్దు. చాలా మందికి లక్ష రుణం ఉన్నా ఇప్పటి వరకు కాలే. రైతులు ప్రభుత్వంపై తిరుగబడే సమయం ఆసన్నమైంది.

–చల్లారెడ్డి, రైతు, బుద్ధారం, నల్లగొండ మండలం

### లక్ష రుణం తీసుకున్నా.. మాఫీ కాలే



నేను ఎన్నికల ముందు లక్ష రూపాయల పంట రుణం తీసుకున్నాను. వడ్డీ కలిపి మరో పది వేలు పెరిగింది. ఫస్ట్ సారే రుణమాఫీ అవుద్ది అనుకున్నా. కానీ రెండో సారి కూడా కాలేదు. ఊర్ల ఉన్న వ్యవసాయ అధికారిని అడిగితే కాలేదన్నాడు. అదేందని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి వస్తే నో రికార్డ్స్ అని వస్తుందంట. అదేందంటే మాకు తెల్వదు అంటున్నారు. కారణం కూడా ఏం తెలిసే పరిస్థితి లేకపోవటంతో అసలు అవుద్దా కాదా అనేది అర్థం కావట్లేదు.

–నామ తార, చిన్న సూరారం, నల్లగొండ మండలం

## మర్రిగూడ పీఏసీఎస్‌లో గందరగోళం

- మొదటి విడుతలో 122కు 67 మందికే మాఫీ



మర్రిగూడ పీఏసీఎస్ కార్యాలయం

మర్రిగూడ : మర్రిగూడ పీఏసీఎస్ పరిధిలో 305మంది రైతులు రూ.1.55 కోట్ల పంట రుణం తీసుకున్నారు. మొదటి విడుతలో లక్షలోపు రుణం తీసుకున్న 122మంది రైతుల జాబితాను ప్రభుత్వం ప్రకటించగా 67 మందికే మాఫీ అయ్యింది. ఇందులో కొందరు రైతులకు రూ.2వేల నుంచి 15వేల వరకే మాఫీ అయినట్లు, మరికొంత మంది రైతులకు రుణమాఫీ జాబితాలో పేర్లు కూడా లేవని తెలుస్తున్నది. మాఫీ కానీ రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రుణ మాఫీకి సంబంధించిన వివరాలను పీఏసీఎస్ అధికారులు ఆన్‌లైన్‌లో పొందుపర్చకపోవడంతోనే ఈ తప్పిదం జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు.

### కాళ్లు మొక్కినా పట్టించుకుంటలేరు



మర్రిగూడ సొసైటీలో నా భర్త శంకర్ రూ.50వేల లోన్ తీసుకున్నాడు. ఆయన చనిపోయిండు.లోన్ మాఫీ కాలేదని అధికారులు అంటున్నరు. మర్రిగూడ సొసైటీ అధికారులు గుర్రంపోడ్ సొసైటీకి వెళ్లి చెక్ చేసుకో అంటే అక్కడికి వెళ్లిన. గుర్రంపోడ్ అధికారులు అగ్రికల్చర్ ఆఫీస్‌కు వెళ్లమన్నరు. ఇలా అటూ ఇటూ తిప్పుతున్నరు. ఏడ్చినా, కాళ్లు మొక్కుతున్నా పట్టించుకుంటలేరు. భర్త లేక కుటుంబ భారమంతా నా మీదనే ఉంది. కూలీ పనికెళ్తేనే పూట గడుస్తుంది. నేను నా పిల్లలు బతికేదే కష్టంగా ఉంది. లోన్ మాఫీ కాకపోతే ఏడ తెచ్చి అప్పు తీర్చాలె.

–పగడాల సైదమ్మ, మర్రిగూడ

### నాకు 15వేలు కూడా మాఫీ కాలేదు



నేను మర్రిగూడ సొసైటీ బ్యాంకులో 15వేల లోన్ తీసుకున్నా. గవర్నమెంట్ మాఫీ అనగానే సొసైటీకి వెళ్లి చెక్ చేసుకున్నా. 4వేల రూపాయలే మాఫీ అయ్యింది. ఏం అర్థం కాలేదు. మిగతావి ఎందుకు మాఫీ కాలేదని అధికారులకు అడిగితే సరైన సమాధానం చెప్తలేరు. ఏదో కంప్యూటర్ మిస్టేక్ జరిగిందని అంటున్నరు. కంగారు పడొద్దు, పైకి లిస్టు పంపిస్తం, మాఫీ అయితదని అంటున్నరు.

–గ్యార నర్సింహ, మర్రిగూడ

# సాగర్‌కు భారీగా ఇన్‌ఫ్లో

- శ్రీశైలం నుంచి 3.69లక్షల క్యూసెక్కుల రాక
- 537.40 అడుగులకు చేరిన నీటిమట్టం
- నేడు సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల
- సాయంత్రం 4 గంటలకు ముహూర్తం. హాజరుకానున్న మంత్రులు



నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 1(నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి ఎడమ కాల్వ ఆయకట్టుకు సాగునీటి విడుదల కోసం రంగం సిద్ధమైంది. ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం నుంచి భారీ వరద సాగర్‌కు పోటెత్తుతున్నది. దాంతో రైతుల డిమాండ్ నేపథ్యంలో సాగర్ ఎడమ కాల్వకు సాగునీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం సాయంత్రం 4గంటలకు ఎడమకాల్వకు నీటి విడుదలకు ఏర్పాట్లు చేశారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు నీటి విడుదలలో పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

ఎగువ కృష్ణాలో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానదిపై ఉన్న అన్ని ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు నిండిపోయాయి. దిగువన ఉన్న నాగార్జునసాగర్ నిండాల్సి ఉంది. గురువారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4.64లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 10 గేట్లను 18 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 3,69,866 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తున్నది. దీంతో సాగర్ నీటిమట్టం గత పది రోజుల్లోనే 34 అడుగల మేర పెరిగి ప్రస్తుతం 537.40 అడుగులకు చేరుకుంది. పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ఇంకా 53 అడుగుల మేర నీరు చేరాల్సి ఉంది. ఇక పూర్తి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలకు గానూ గురువారం సాయంత్రం 6గంటలకు 183 టీఎంసీలుగా నమోదైంది. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి 24 గంటల్లోనే సాగర్‌లో 11 అడుగుల మేర నీటిమట్టం పెరిగి 22 టీఎంసీల నీరు అందనంగా వచ్చి చేరింది. కృష్ణానది ఎగువన ఇంకా భారీ వర్షాలు కురుస్తున్నందున మరో మూడు నాలుగు రోజులు ఇలాగే వరద వచ్చే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలాగే కొనసాగితే వారం రోజుల్లోనే సాగర్ కూడా పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోనుంది. మరోవైపు ఇప్పటికే సాగర్ నుంచి కుడి కాల్వకు 4,152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాజాగా శుక్రవారం మెయిన్ పవర్ హౌజ్ ద్వారా 2,2592 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తూ దిగువకు వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాగర్ ఎడమ కాల్వకు సైతం సాగునీటి విడుదలకు రంగం సిద్ధం చేశారు.

### మంత్రుల పర్యటన ఇలా..

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సాగునీటిని విడుదల చేయనున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రత్యేకంగా హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.20గంటలకు సాగర్‌లోని బుద్ధవనానికి చేరుకుంటారు. అక్కడి నుంచి స్థానిక ఎం పీ, ఎమ్మెల్యేలతో కలిసి మం త్రులు 3.40గంటలకు పొట్టిచెల్మ వద్ద ఉన్న ఎడమకాల్వ హెడ్ రెగ్యులేటరీ వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4గంటలకు గేట్లను ఎత్తి ఎడమ కాల్వలోకి నీటిని విడుదల చేస్తారు. అనంతరం 4.20గంటలకు సాగర్ డ్యామ్ వద్దకు చేరుకుని వరద ఉధృతిని పరిశీలించి విజయవిహార్‌కు చేరుకుంటారు. తిరిగి 5.30 గంటలకు బుద్ధవనంలోని హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనం అవుతారని నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

### కేసీఆర్ హయాంలో వరుసగా..

మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పదేండ్లలో 2015లో మినహా వానకాలంలో ఎడమకాల్వకు సాగునీటిని విడుదల చేశారు. 2017లో మాత్రం అక్టోబర్ 31న నీటి విడుదల జరిగింది. తర్వాత వరుసగా ఆరు సార్లు సాగునీటిని విడుదల చేశారు. మిగతా అన్ని సంవత్సరాల్లోనూ ఆగస్టు నెలలో సాగునీటి విడుదల జరిగింది. 2022లో మాత్రం జూలై 28న ఎడమకాల్వకు నీటి విడుదల చేశారు. 2023లో వర్షాభావ పరిస్థితుల్లో సాగర్ నిండకపోయినా వానకాలం పంటకు ప్రభుత్వం నీళ్లిచ్చి రైతులను ఆదుకుంది. ఈ యాసంగిలో మాత్రం కాంగ్రెస్ సర్కార్ నీళ్లు ఇవ్వలేకపోయింది. దీంతో రైతులు ఈ సీజన్‌పై ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో సాగర్‌కు భారీగా వరద వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 11లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతోపాటు ఏఎంఆర్పీ పరిధిలోని చెరువులు, కుంటలను నింపడం ద్వారా మరో లక్ష ఎకరాలకు పైగా పంటలకు భూగర్భ జలాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే రైతుల్లో చాలా మంది నారుమళ్లు పోసుకోగా మరికొందరు సిద్ధమవుతున్నారు. నారుమళ్లు ముందు సిద్ధం చేసుకున్న వారు ప్రస్తుతం నీటి విడుదలతో త్వరలోనే వరినాట్లకు కూడా సన్నద్ధం కానున్నారు.



మిర్యాలగూడ మండలం కురియాతండా వద్ద దెబ్బతిన్న ఎడమ కాల్వ కట్ట

# ఎడమ కాల్వకు గండ్ల గండం

- లైనింగ్ పనుల్లో నాణ్యత కరువు
- బలహీనంగా కనిపిస్తున్న కాల్వ కట్టలు
- ఎక్కడైనా గండి పడితే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం

మిర్యాలగూడ, ఆగస్టు 1 : నాగార్జునసాగర్‌కు వరద పోటెత్తుండడంతో శుక్రవారం ఎడమ కాల్వకు నీటి విడుదల చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కానీ, నీటి ప్రవాహాన్ని తట్టుకుని కింది వరకూ పంపాల్సిన కాల్వలు అందుకు తగట్టు ఉన్నాయా అంటే.. లేవనే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడమ కాల్వ కట్టలు పలు చోట్ల బలహీనంగా ఉండడంతో ఎక్కడ గండి ఏర్పడుతుందోనన్న భయాందోళన రైతుల్లో నెలకొంది. వారం క్రితం నడిగూడెం మండలం రామాపురం వద్ద కాల్వ కట్టకు బుంగ పడగా, అధికారులు మర్మతులు చేయకుండా వదిలేశారు. కేవలం అటుగా ఎవరూ వెళ్లకుండా కంప చెట్లు వేసి, హెచ్చరిక ఫ్లెక్సీని మాత్రం ఏర్పాటుచేశారు. రెండు సంవత్సరాల క్రితం నిడమనూరు మండలం ముప్పారం–వేంపాడు వద్ద నారెళ్లగూడెం మేజర్ సమీపంలో పడిన గండి ఎంత విధ్వంసం సృష్టించిందో రైతులు ఇంకా మరిచిపోలేదు. అప్పట్లో లక్ష్మీదేవిగూడెం, నిడమనూరు, నర్సింహులుగూడెం గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో పంట మునగడంతోపాటు అడుగల మేర ఇసుక మేటలు వేసింది. చుట్టుపక్కల ప్రజలకు కంట మీద కునుకు లేకుండా పోయింది. దానికితోడు మరమ్మతుల కారణంగా నీరందక వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అధికారుల నిర్లక్ష్యంతోనే పరిస్థితి ఇంత తీవ్ర రూపం దాల్చిందని విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటికీ అనేక చోట్ల ఎడమ కాల్వ కట్టలు బలహీనంగా ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. వర్షాభావ పరిస్థితుల్లో ఇప్పటికే గత రెండు సీజన్లు ఆయకట్టుకు నీళ్లు రాలేదు. ఇప్పుడు వరుణుడి కరుణతో వరద పోటెత్తుండడంతో ఆశలు చిగురిస్తుండగా, కాల్వల పరిస్థితి భయపెడుతున్నది.

### కాల్వ మరమ్మతులకు రూ.44.78కోట్లు...

సాగర్ ఎడమ కాల్వ పటిష్ఠంగా ఉండడానికి గండ్లు పడకుండా ఉండేందుకుగాను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.44.78 కోట్లు కేటాయించింది. పనులు ఈ ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. నాణ్యత కూడా పాటించడం లేదని రైతులు వాపోతున్నారు. పలుచోట్ల కాల్వ కట్ట లైనింగ్, ఫ్లోరింగ్ దెబ్బతినడంతో రూ.30కోట్లతో అధికారులు తిరిగి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

### మూడ్రోజుల్లో పనులు పూర్తి

ఎడమ కాల్వ కట్ట మరమ్మతు పనులు దాదాపు దగ్గర పడ్డాయి. మూడు రోజుల్లో మొత్తం పూర్తవుతాయి. ఎక్కడా గండ్లు పడే అవకాశం లేదు. ఎడమ కాల్వకు నీటి విడుదల జరిగినా ఎలాంటి నష్టం వాటిళ్లకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– లక్ష్మణ్, ఎన్నెస్పీ ఈఈ



వేములపల్లి మండలం అన్నపరెడ్డిగూడెం వద్ద దెబ్బతిన్న ఎడమ కాల్వ కట్ట